నల్లచెరువు బాధితుల గోడు వర్ణనాతీతం..

- కూల్చివేతలతో పేదోడి బతుకు ఆగమాగం
- వర్షంలో తడుస్తూ.. సామాను తీసుకుపోతూ..
- శిథిలాల మధ్య నుంచి ఆటోలు, ట్రాలీలలో ఇతర ప్రాంతాలకు ..

నేలమట్టమైన గుడిసెలు, షెడ్లు

సిటీబ్యూరో,సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : కూకట్‌పల్లి నల్లచెరువు బాధితుల గోడు వర్ణనాతీతం. హైడ్రా కూల్చివేతల్లో బతుకుదెరువు కోల్పోయి రోడ్డున పడ్డ సామాన్యుడి జీవనచిత్రమిది. రెక్కాడితేకానీ డొక్కాడని బడుగుజీవుల జీవితాలపై హైడ్రా బుల్డోజర్ పంపి వారి బతుకును ఛిద్రం చేసింది. ఆదివారం నల్లచెరువులో జరిగిన కూల్చివేతల తర్వాత మంగళవారం రోజు 'నమస్తే తెలంగాణ'కు కనిపించిన దృశ్యాలివి. ఒకవైపు జోరుగా వర్షం కురుస్తున్నా లెక్కచేయక శిథిలాల మధ్య తమ సామగ్రిని వెతుక్కుంటూ బతుకుజీవుడా అంటూ తరలించుకుపోతున్నారు బాధితులు. హైడ్రా కూల్చివేతల్లో అడుగడుగునా తమ బతుకులు ఆగమైతాయని కాళ్లావేళ్లా పడ్డా బాధితులను కనికరించని అధికార కర్కశత్వపు తాలూక ఆనవాళ్లు ఇప్పటికీ సజీవంగా కనిపిస్తూనే ఉన్నాయి. రెండురోజుల క్రితం కూల్చివేతల్లో రేకుల షెడ్లు నేలమట్టం కాగా.. వాటిలో మిగిలిన సామానును, రేకులను మోసుకుంటూ ట్రాలీలు, లారీల్లో మరోచోటకు తరలించుకువెళ్లే క్రమంలో వానలో, బురదలో వారి సామాను చిందరవందరగా పడేసిన తీరును చూసి ప్రతి ఒక్కరూ గుండె పగిలేలా రోధిస్తున్నారు. తమ బతుకులు ఎలా బాగుపడాలా అని ఆవేదన చెందుతూ సర్కార్ తీరును నిరసిస్తూ శాపనార్థాలు పెడుతున్నారు. టెంట్‌హౌజ్ సామగ్రి కూల్చివేతల్లో దెబ్బతిననగా.. మిగిలిన కొంతను తమతో తీసుకెళ్తున్నారు . అసలు నల్లచెరువు కూల్చివేతల దృశ్యాలు చూస్తే భూకంపం వచ్చిన తర్వాత ఆ ప్రాంతమంతా ఎలా ఉంటుందో అలాంటి పరిస్థితే ఇక్కడ కూడా సాక్ష్యంగా కనిపిస్తోంది.

కూకట్‌పల్లి నల్లచెరువు ప్రాంతంలో కూల్చివేతల తర్వాత..

కూల్చివేతల అనంతరం డీసీఎంలో సామగ్రిని తీసుకెళ్తున్న బాధితులు

'తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ వేయాలి'

వలిగొండ, సెప్టెంబర్ 24 : తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీ వేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిష్టఫర్ మాట్లాడుతూ జార్ఖండ్ ప్రభుత్వంలా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జోగు అంజయ్య, గంధమల్ల మల్లమ్మ, శీలం స్వామి, బాలయ్య, స్వామి, లక్ష్మమ్మ, కలమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు

బీబీనగర్, సెప్టెంబర్ 24 : మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక మహిళా శిక్షణ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.నిరూప స్వచ్ఛ భారత్, ఆడపిల్లల సంరక్షణ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతిజ్ఞ, గీతం, స్వచ్ఛభారత్, ఆడపిల్లల సంరక్షణ నాటకాలను ప్రదర్శించారు. సేవా కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన వలంటీర్లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు బీబీనగర్ మం డలం రహీంఖాన్‌గూడెంలో ట్రాఫిక్ రూల్స్ పై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రూప, శ్రీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పావని, స్రవంతి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 24 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కౌన్సిలర్ సామల మల్లారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 8వ వార్డు సీతవానిగూడెంలో మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తంతరపల్లి రమేష్, బాబు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సేవా భావాన్ని అలవర్చుకోవాలి

మోత్కూరు, సెప్టెంబర్ 24 : విద్యార్థి దశలోనే సేవా భావాన్ని అలవర్చుకోవాలని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రభాజస్టీస్ అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కడారు నర్సింహారెడ్డి, అధ్యాపకులు పురోషోత్తంరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 24 : జాతీయ సేవా పథకాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఏ సమస్య ఎదురైనా పరిష్కరించుకునే నాయకత్వ లక్షణాలు అవలర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల అన్నారు. యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సేవా పథక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా పథకంలో పాల్గొని దేశాభివృద్ధిలో తమవంతు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎన్ఎస్ఎస్, స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాంబాబు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 24 : మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బందికి మంగళవారం శారాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు అనూష, వైద్య సిబ్బంది పెద్దలక్ష్మి, ఏఎన్ ఎంలు రత్నాబాయి, సునీత, ఆశ కార్యకర్తలు లలిత, స్వరూప, మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 24 : విద్యార్థులు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి అన్నారు. సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 55వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, భువనగిరి కోర్టు ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నర్సింహ, అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి, మల్లయ్య, అతనీధర్, వెంకటసాయి, అలివేలుమంగ, శృతి పాల్గొన్నారు.

కుక్క దాడిలో విద్యార్థినికి గాయాలు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 24 : కుక్క దాడిలో విద్యార్థికి గాయాలైన సంఘటన పట్టణంలోని ఎస్టీ హాస్టల్లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్టీ హాస్టల్లో ఉంటూ చదువుతున్న కీర్తనను హాస్టల్లోకి వచ్చిన వీధి కుక్క కరిచింది. హాస్టల్లో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో దవాఖానకు తీసుకెళ్లడానికి ఇబ్బందిగా మారిందని, స్థానికుల సహాయంతో దవాఖానకు పంపించామని తోటి విద్యార్థినులు తెలిపారు. గతంలో కడుపునొప్పి వచ్చినా పట్టించుకోలేదని, హాస్టల్లో వాచ్‌మెన్ లేడని చెప్పారు. నైట్ సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 24 : మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కట్టెల వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. ఆ డబ్బును స్థానిక నాయకులు మంగళవారం వీరయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూసుకుంట్ల సత్తిరెడ్డి, నర్సింహ, జంగయ్య, లింగయ్య, జగన్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

ఒకే ఎన్నిక సరికాదు : సీపీఎం

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 24 : దేశంలో ఒకే ఎన్నిక విధానం సరికాదని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నా ఎన్డీఏ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. తక్షణమే తమ నిర్ణయాన్ని మార్చుకొని మెజార్టీ ప్రజలు, రాజకీయ పార్టీల నిర్ణయాన్ని గౌరవించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకే పరిమితం కాకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ శాఖ నూతన కార్యదర్శిగా బందల ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు గంధమల్ల మాతయ్య, వనం రాజు, జంగయ్య, సంజీవ, దయానంద్, శంకర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేత

మచ్చబొల్లారం డివిజన్, ఏడు కాలనీల డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేసి వివరిస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, సెప్టెంబర్ 24: మల్కాజిగిరి నియోజకవర్గం, మచ్చబొల్లారం డివిజన్‌లోని ఏడు కాలనీల డ్రైనేజీ సమస్యను ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం మచ్చబొల్లారం డివిజన్, ఏడు కాలనీల డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే.. గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఈ కాలనీల్లో సరియైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకుండానే గ్రేటర్ టౌన్ ప్లానింగ్ అధికారులు బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని అన్నారు. బహుళ అంతస్తులు నిర్మించిన తర్వాత డ్రైనేజీని బయటకు వదులుతున్నారని అన్నారు. తుర్కపల్లి ప్రాంతంలోని మడుకట్ల బస్తీ, శ్రీదామ్ ఎన్ క్లేవ్ ప్రాంతాలను హకీంపేట ఎయిర్‌ఫోర్స్ లోపలి నుంచి వరదనీరు ముంచెత్తుతున్నదని అన్నారు. ఇప్పటికే దీనిపై ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వర్మతో చర్చించామని, వారు సానుకూలంగా స్పందించి.. పైప్ లైన్ ద్వారా వరదనీరు ప్రవహించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. ఎయిర్‌ఫోర్స్‌వారు నిర్మించే పైపులైన్‌కు అనుసంధానంగా ప్రభుత్వం మరో పైపులైన్ నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, పరశురాంరెడ్డి, కరంచంద్, జీకే హన్మంతరావు, రమేశ్, ఉపేందర్‌రెడ్డి, రాము యాదవ్, అనిల్‌కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడల్లో టేకులసోమారం విద్యార్థుల ప్రతిభ

స్కూల్ గేమ్స్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వలిగొండ, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలో నిర్వహించిన 68వ మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో టేకులసోమారం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో, అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారు ప్రథమ బహుమతులను గెలుచుకొని అక్టోబర్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎక్కలదేవి మల్లేశం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయగిరి గౌడ సంఘం అధ్యక్షుడిగా చంద్రయ్యగౌడ్

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి కల్లుగీత కార్మిక సహకార సంఘం అధ్యక్షుడిగా గడ్డమీది చంద్రయ్యగౌడ్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన గీత కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గీత కార్మికులు సూదగాని నర్సింహ గౌడ్, సార నర్సింహ గౌడ్, బత్తిని పాండు, సుధాకర్, చంద్రమౌళి, స్వామి, జితేందర్, కృష్ణ, నర్సింహ, వీరస్వామి, జహంగీర్, చంద్రయ్య, రాజు, యాదగిరి, మల్లయ్య, భిక్షపతి, పాండు, అనిల్ పాల్గొన్నారు.

సీపీఎం బీబీనగర్ పట్టణ కార్యదర్శిగా సతీశ్‌కుమార్

ఒవల్దాస్ సతీశ్ కుమార్

బీబీనగర్, సెప్టెంబర్ 24 : సీపీఎం బీబీనగర్ పట్టణ కార్యదర్శిగా ఓవల్దాసు సతీశ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీ పట్టణ ఏడవ మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడుతూ బీబీనగర్‌లో హైవే రోడ్డు దాటడానికి ఆంధ్రాబ్యాంకు, స్టేట్ బ్యాంకు మధ్యలో పుట్‌వే బ్రిడ్జి నిర్మించాలన్నారు. బీబీనగర్‌లో అన్ని డిపోల అన్ని రకాల బస్సులు, రైళ్లను ఆపాలని, బీసీ, ఇతర హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలన్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని, మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో చేపట్టే పోరాటాలకు ప్రజలుసిద్ధం కావాలని కోరారు.

దుండగులను అరెస్ట్ చేయాలి : మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 24 : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నేతాజీ రస్తా వద్ద మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. విగ్రహాన్ని ధ్వంసం చేసి ఐదు రోజులు అయినా నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. దళితులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. నిందితులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యుడు మీసాల గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు బాలనరసింహ, బహుజన ప్రజాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య, నాయకులు పాల్గొన్నారు.

సీవరేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి

- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి
- డివిజన్-6లోని పలు ప్రాంతాల్లో పర్యటన..

డివిజన్-6లో సీవరేజీ సమస్యను పరిశీలించి తెలుసుకుంటున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో, సెప్టెంబరు 24 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న సీవరేజీ సమస్యల నివారణపై జలమండలి ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు సంస్థ ఎండీ అశోక్‌రెడ్డి గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డివిజన్-6లోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. మొదట కృష్ణానగర్ సీ బ్లాక్ ప్రాంతంలో సీవరేజీ నెట్‌వర్క్ పైపులైన్‌ను పరిశీలించారు.. ఇది 30 ఏండ్ల క్రితం నిర్మించింది కావడంతోపాటు జీహెచ్ఎంసీ నాలాకు అనుసంధానమై ఉంది.. దీంతో ఎల్లారెడ్డి సెక్షన్ పరిధిలో తరచూ సీవరేజీ ఓవర్‌ఫ్లో సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన గుర్తించారు. అనంతరం అమీర్‌పేట మెయిన్‌రోడ్, శ్రీనగర్ కాలనీ ఆటో స్టాండ్ జంక్షన్ ప్రాంతంలోని మురుగునీటి సమస్యను పరిశీలించారు. సీవరేజీ ఓవర్ ఫ్లోతో ఆ నీళ్లంతా సెల్లార్‌లోకి వస్తున్నాయని స్థానికులు ఎండీకి వివరించారు. అనంతరం సనత్‌నగర్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ(ఆటోమెటిక్ వాల్వ్ ఆపరేషన్ పద్ధతి)ని ఎండీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ , మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌నగర్‌లో ఈడీ పర్యటన

జలమండలి ఓఅండ్ఎం డివిజన్-6 పరిధిలోని ఆనంద్‌నగర్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యటించారు. ఆ ప్రాంతంలోని తాగునీటి సరఫరా, నాణ్యత, సప్లయి లెవల్స్, మురుగునీటి నిర్వహణ, తదితర పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఈడీ సూచించారు. ఈడీ వెంట సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, డీజీఎం, మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 24: ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 205 భాగస్వామ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అన్ని డియర్‌నెస్ అలవెన్స్(డీఏ)లలో 1-7-2024న జీవో ద్వారా ప్రకటించిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేత రవీందర్ రెడ్డి, చావ రవి, శ్రీపాల్ రెడ్డి, సదానంద్ గౌడ్, మున్సిపల్ జేఏసీ నాయకుడు తిప్పర్తి యాదయ్య, పి.జగన్‌మోహన్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జీహెచ్ఎంసీ యూనీడీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నల్లతీగల మధు, ప్రధాన కార్యదర్శి ఉస్మాన్, తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథం పాల్గొన్నారు.

సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దు

ఇస్రో చైర్మన్ సోమనాథ్

కార్టూన్ ఎగ్జిబిషన్‌లో ఇస్రో చైర్మన్ సోమనాథ్, మంత్రి జూపల్లి, 'నమస్తే తెలంగాణ' కార్టూనిస్ట్ మృత్యంజయ్

రవీంద్రభారతి, సెప్టెంబర్ 24 : సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దని, ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తెలుగు రీజియన్ మలయాళ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూన్ పేరిట ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, విద్య, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకుడిగా ఉన్నప్పుడు తాను కార్టూన్లు వేసేవాడినని, తనకు కార్టూనిస్టులు అన్నా, కార్టూన్‌లో ఉండే చమత్కారం అన్నా ఎంతో ఇష్టమని అన్నారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. కార్టూన్ మూడక్షరాలే కానీ... ఆ కార్టూన్‌లో కనిపించే మూడు గీతల్లోనే 30 అర్థాలు దాగి ఉన్నాయన్నారు. ప్రముఖ కార్టూనిస్టులు కె.శంకర్ పిళ్లే, ఆర్‌కే లక్ష్మణ్, ఇపి ఉన్నీ లాంటి ఎందరో కార్టూనిస్టులు కార్టూన్ రంగాన్ని సుసంపన్నం చేశారని తెలిపారు.

'నమస్తే తెలంగాణ' కార్టూనిస్ట్ మృత్యంజయ్ మాట్లాడుతూ.. కార్టూనిస్టులకు స్పేస్ దొరకడం చాలా కష్టమని... కానీ ఇస్రో చైర్మన్, కార్టూనిస్ట్ సోమనాథంకు అంతరిక్షమంతా అతనిదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, సిటీఆర్ఎంఏ టీఈఆడీఎస్ అధ్యక్షుడు బెంజిమెన్, కేరళ కార్టూన్ అకాడమీ చైర్మన్ సుధీర్‌నాథ్, హైదరాబాద్ ఫోరం పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్ , సంభానీ, వెంకటేశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావుకు సన్మానం

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 24 : జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహారావును వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ మహిళలు, శిశువులు, వికలాంగులు, వయోవృద్ధులు సంక్షేమానికి అందరి సహకారం అవసరమన్నారు. జిల్లాలోని అన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధుల సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధరణికోట నర్సింహ, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు కొడారి వెంకటేశ్, వీహెచ్‌పీఎస్ నాయకులు సింగారం రమేశ్, మచ్చ ఉపేందర్, లాలయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో స్వచ్ఛ కార్యక్రమం

రాజాపేటలో స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రాజాపేట, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కిష్టన్, వైద్యాధికారి భరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ అవయవదాతల సంఘం జిల్లా కన్వీనర్‌గా బాబు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 24 : తెలంగాణ శరీర అవయవదాతల సంఘం జిల్లా కన్వీనర్‌గా ఆలేరు మండలం టంగు